క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం



తేరుపై సతీసమేతంగా ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

కలికిరి: పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం స్వామివారి రథోత్సవం కార్యక్రమం వైభవంగా సాగింది. ఉదయం 10 గంటలకు ఆలయం నుంచి ప్రారంభమైన తేరును లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. ఇంటింటా మహిళలు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులిచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, నరసింహాచార్యుల ఆధ్వర్యంలో రథోత్సవం సాగింది.

శివలింగానికి అభిషేకం



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగిన శివలింగానికి పంచామృతాభిషేకం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. వేద పండితులచే పంచ హారతి, సప్త హారతి, నక్షత్ర హారతి, రుద్రాభిషేకం కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదానం ఏర్పాటు చేశారు.

దివ్యాంగ పిల్లలు గుర్తింపు



సర్వే చేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: మదనపల్లె అర్బన్, మండల పరిధిలోని 34 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించినట్లు సహిత విద్య ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డమ్మ తెలిపారు. గత నెల 13 నుంచి ఈనెల 9వతేదీ వరకు సర్వే చేయడం జరిగిందన్నారు. సర్వే ద్వారా ఇంకా బడికి వెళ్లని, మధ్యలో బడి మానేసిన ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించామని తెలిపారు. వీరిని సమీపంలోని భవిత కేంద్రంలో చేర్పించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భవిత కేంద్రంలో పిల్లలకు అవసరమైన ఫిజియోథెరఫీ, స్పీచ్‌థెరఫీ, అవసరమై విద్య బోధిస్తామని తెలిపారు.

ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రసన్నలక్ష్మి

పీలేరు : ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యమని డాక్టర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. సోమవారం తలపులలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు కనీసం నాలుగుసార్లు డాక్టర్‌తో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచిత ప్రత్యేక గర్భిణీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 26 మంది గర్భిణులకు ఏఎన్ఎం ప్రమీల సహాయంతో పండ్లు, పాలు, బ్రెడ్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం నాగవేణి, ఫామున్నీషా పాల్గొన్నారు.

'ఉక్కు' ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె: విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించడం అన్యాయమని వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం మదనపల్లెలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు తిరుమల మాట్లాడుతూ తొలగించిన 5,400 మంది ఉద్యోగుల భవిష్యత్తు అంధకారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును తక్షణమే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సమితి సభ్యులు దేవా, చలపతి, చంద్ర, కృష్ణప్ప, సంజీవ, మల్లికార్జున, రాధమ్మ, అలివేలమ్మ, మణీ, నారాయణ, చంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

ఛత్రపతి పట్టాభిషేక ర్యాలీ

ఓబులవారిపల్లె : ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగిన రోజు సందర్భంగా సోమవారం రైల్వేకోడూరు పట్టణ కేంద్రంలో హైందవ సంఘం వారు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వానికి ప్రతీకని వక్తలు పేర్కొన్నారు.

ఆనంద యోగం.. ఆరోగ్య భాగ్యం

- యోగాంధ్రలో భాగస్వాములు కావాలి
- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పిలుపు



మదనపల్లె రూరల్ : యోగాసనాలు వేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తదితరులు

మదనపల్లె రూరల్ : ప్రతి ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యవంతులు కావాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం జెడ్పీహైస్కూల్‌లో యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మెప్మా మహిళలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు డివిజన్‌లోని ప్రతి గ్రామం, మండలం, పట్టణాల్లో వైభవంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ప్రజలందరూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. యోగా శిక్షకులు బ్రహ్మకుమార్, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, డీఎల్‌పీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, మెప్మా సీఎంఎం మధుసూధనరెడ్డి, ఓంప్రకాష్, రేణుక, హెడ్‌కానిస్టేబుల్ రామ్మూర్తి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కలకడ : నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని 12 సచివాలయాల పరిధిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కలకడలో ర్యాలీ నిర్వహించి, అనంతరం కె.బాటవారిపల్లె ప్రభుత్వ పాఠశాల మైదానం యోగాసనాలు చేశారు.

యోగాంధ్రలో పాల్గొన్న అధికారులు

రామసముద్రం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామసముద్రం మండలంలో అన్నమాచార్యుల 32,000 సంకీర్తనలుకు గుర్తుగా 5 వేదికలలో 1,000 మందితో సోమవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, తహసీల్దార్ నిర్మలాదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారిగా ఎంపీడీఓ దిన్నిపల్లెలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనగా సభ్యులుగా తహసీల్దార్, మెడికల్ ఆఫీసర్, ఏంఈఓ, యోగ గురువులు వంశీ, పార్థ, వెలుగు ఏపీఎం విద్యుత్‌శాఖ ఏఈ పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, సచివాలయం సిబ్బంది, సంఘమిత్రలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధిహామీ సిబ్బంది, విద్యార్థులు , సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యోగ సాధన అలవర్చుకోవాలి

పీలేరు రూరల్ : ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయడం అలవర్చుకోవాలని తహసీల్దార్ భీమేశ్వర్ రావు సూచించారు. సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యోగ సాధన చేశారు. ఎంపీడీఓ శివశంకర్, షీ దివ్య యోగ విద్యాలయం అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తంబళ్లపల్లె: యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయిలో యోగాంధ్ర కార్యాక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ థామస్, ఎంఈఓ-2 నాగసుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని బోధించే సజీవ శాస్త్రం యోగ

పెద్దమండ్యం: మనిషికి ఆరోగ్యాన్ని బోధించే సజీవ శాస్త్రం యోగ అని ఎంపీడీవో శ్రీధర్‌రావు అన్నారు. పెద్దమండ్యం ఉన్నత పాఠశాలలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ల కార్డులతో ఉన్నత పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంఈవో రామక్రిష్ణ, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గట్టు, బి.కొత్తకోటలో యోగాంధ్ర

బి.కొత్తకోట: మండలంలోని గట్టు జెడ్పీ హైస్కూల్, బి.కొత్తకోటలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. వారికి యోగాపై అవగాహన కల్పించి ఆసనాలు వేయించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది యోగాసనాలు వేశారు.

యోగాతో ఆరోగ్యం..ఆనందం

కురబలకోట: యోగాతో ఆరోగ్యం..ఆనందం సాధ్యమని కురబలకోట తహసీల్దారు తపస్విని అన్నారు. సోమవారం అంగళ్లలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగ సాధన ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలన్నారు. రోగాలు నియంత్రణలోకి వస్తాయని, కొత్త రోగాలు దరి చేరవన్నారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పీలేరు రూరల్ : యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజలు



కలకడ: యోగా చేస్తున్న అధికారులు, సిబ్బంది, ప్రజలు



బి.కొత్తకోట: గట్టులో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, ప్రజలు



రామసముద్రంలో..



కురబలకోటలో..



పెద్దమండ్యం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సమస్యలు పట్టించుకోండి సారూ..!

పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు వినతి



పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : 'రెవెన్యూ సమస్యలతో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు. కనీసం మీరైనా పరిష్కరించండయ్యా' అంటూ సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల ప్రజలు మొరపెట్టుకున్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. బి.కొత్తకోట మండలం గట్టు గ్రామంలో అమ్మమ్మ జగిలి శీతమ్మ నుంచి రిజిస్టర్డు వీలునామా ద్వారా సంక్రమించి, కోర్టు డిక్రీ ద్వారా తన భాగానికి వచ్చిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేసి, న్యాయం చేయాల్సిందిగా మదనపల్లె మండలం రామాచార్లపల్లెకు చెందిన కుళ్లాయప్ప ఫిర్యాదు చేశాడు. బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయానికి ఈ విషయమై పలుమార్లు అర్జీలు సమర్పిస్తే తహసీల్దార్, వీఆర్వోలు తనను పదేపదే తిప్పుకుంటున్నారే తప్ప పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. అలాగేవాల్మీకిపురం మండలం ప్యారంపల్లె గ్రామంలో తను కొనుక్కున్న భూమిని కుమారులు నాగరాజు, శ్రీనివాసులు దౌర్జన్యం చేసి తెల్లకాగితంపై వేలిముద్రలు వేయించుకుని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ రామిశెట్టి యశోదమ్మ వాపోయారు. ప్యారంపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి తన కుమారులకు మద్యం తాగించి, తనపై దౌర్జన్యం చేయాల్సిందిగా పంపుతున్నాడని, తనపేరు మీద ఉన్న భూమిని 1బీలో నమోదుచేయాల్సిందిగా వేడుకుంది. కుమారుల నుంచి ప్రాణహాని ఉందని పేర్కొంది. తాత పేరున మంజూరైన డీకేటీ భూమిని మదనపల్లెకు చెందిన కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుని భూమిలోనికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని సీటీఎం పంచాయతీ రాయనచెరువుపడ్డిపల్లెకు చెందిన బత్తుల ఆదిలక్ష్మి ఫిర్యాదు చేసింది. తనకు భూమి తప్ప వేరే జీవనాధారం లేదని, తాత పేరు మీద ఉన్న భూమిని తనకు ఇప్పించాల్సిందిగా వేడుకుంది. సబ్ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు

గిరిజనులకు న్యాయం చేయండి



కేవీపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

కేవీపల్లె : మండలంలోని మార్శెళ్ల పంచాయతీ మంచాలమందలో గిరిజనులకు న్యాయం చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంచాలమందలో గిరిజనుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకునే ప్రయత్నంతోపాటు గిరిజనులపై దౌర్జన్యానికి పాల్పడ్డవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాయలం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం మంచాలమందలో గిరిజన యానాదులకు 10.5 ఎకరాల భూమిని అప్పటి తహసీల్దార్ పట్టాలు ఇచ్చారని తెలిపారు. అప్పటినుంచి ఆ భూములను సాగు చేయడానికి గిరినులు ప్రయత్నిస్తున్నప్పటికీ గ్రామానికి చెందిన అగ్రవర్ణస్తులు అడ్డుపడుతూ వస్తున్నారని తెలిపారు. ఇటీవల ఆ స్థలంలో గిరిజనులు నివాస స్థలాలు ఏర్పరచుకోగా వాటిని దౌర్జన్యంగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఓ గిరిజన వృద్ధుడు, యువతిపై దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. బాధితులు 11 రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్‌కుమార్, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య, ప్రజా సంఘాల నాయకులు రాజేష్, రెడ్డెప్ప, రవి పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న శ్రీ వెంకటరెడ్డి సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ హేమంత్



విద్యార్థులతో ఆనందం పంచుకుంటున్న శ్రీకృష్ణారెడ్డి సిద్ధార్థ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి

మదనపల్లె రూరల్ : ఈఏపీ సెట్ ఫలితాల్లో శ్రీ వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ప్రిన్సిపాల్ ఈ.వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థిని బి.తనుశ్రీ 1,213 స్టేట్‌ర్యాంకు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచిందన్నారు. 15వేలలోపు ర్యాంకులు ఏడుగురు విద్యార్థులు సాధించారని తెలిపారు. వారిలో బి.మోక్షజ్ఞరెడ్డి, 6,604, జి.మిథున్ హరిహరన్ 6,722, పి.అల్మాస్ 8,801, ఏ.మల్లికార్జున, 8,821, పి.దేదీప్య సాయి 12,135, జిజ్ఞాస ప్రసన్న, 14, 736 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులకు అధ్యాపక బృందానికి కళాశాల డైరెక్టర్ హేమంత్ అభినందనలు తెలిపారు. తమ కళాశాలలో ఉన్నతమైన విలువలు నేర్పుతున్నామని డైరెక్టర్ తెలిపారు.

విజయభేరి

ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయభేరి మోగించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఏపీసెట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. వారిలో ఏ.వెంకటసాయిదీపక్, 1,777, కే.సాయి సుదీక్ష 3,185, ఎస్.స్పందన, 3,341, ఆర్.జాహ్నవి, 7,758, బి.హరిత, 8,138, డి.మేఘన, 11,728, ఎస్.కావ్యశ్రీ, 12,862, ఎస్.రెడ్డి టీనా చౌదరి, 13, 752 ర్యాంకు సాధించారన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

గోవధపై సమగ్ర దర్యాప్తు

డీఎస్పీ మహేంద్ర



మదనపల్లె రూరల్ : మండలంలోని టిడ్కో ఇళ్ల సమీపంలోని పశువధ కేంద్రంలో జరిగిన గోవధపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, చట్టప్రకారం దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మహేంద్ర అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో టిడ్కో ఇళ్ల సమీపంలో గోవధ జరుగుతోందన్న సమాచారం మేరకు, తాలూకా సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. వారు క్షేత్రస్థాయిలోకి వెళ్లి చూస్తే.. అక్కడ జెర్సీ ఆవులు, కోడెదూడలు సుమారు 11వరకు ఉండటంతో ప్రత్యేక వాహనంలో బసినికొండలోని గోసంరక్షణశాలకు తరలించామన్నారు. పశువధ కేంద్రం నిర్వాహకులపై కేసు నమోదుచేసి, ఘటనపై ఉన్నతాధికారులకు ప్రత్యేక నివేదిక పంపామన్నారు. గోవధ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసినప్పటికీ కొందరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అనుమతి లేకుండా ధర్నా నిర్వహించారని తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు చేసి, ప్రజాజీవనానికి ఇబ్బందులు కలిగించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు

కేవీపల్లె : సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పీలేరు ఏడీఏ వైవి. రమణరావు తెలిపారు. సోమవారం మండలంలోని వగళ్లలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూనె గింజల పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, వేరుశనగ సాగులో ఎర పంటలు, భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువులతో ప్రయోజనాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం క్షేత్ర స్థాయిలో ఖరీఫ్‌లో రైతులు పాటించాల్సిన సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.లో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె. మంజుల, డాక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

'దారి'ద్ర్యం





ఓ వైపు కంకర తేలిన రోడ్లు.. మరో వైపు గుంతల రోడ్లు.. ఇంకో వైపు బురద రోడ్లు.. పీలేరు పట్టణంలో ఏ దారిలో వెళ్లినా రోడ్ల పరిస్థితి ఇంతే. ఇటీవలే కురిసిన వర్షానికి మరింత అధ్వానంగా తయారయ్యాయి. గతుకుల రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇవే రోడ్లపై నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వెళ్తున్నా వాటి మరమ్మతును మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గంలో ఆర్ఆర్ రెసిడెన్సీ వద్ద, శివాలయం వీధి, పాత బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయి. దీనికి తోడు మదనపల్లె రోడ్డు, చిత్తూరు రోడ్డు మార్గాల్లో ఆర్‌వోబీ పనులు జరుగుతుండడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఓ వైపు గుంతలు, మరోవైపు దుమ్ము ధూళితో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – పీలేరు

వివాహ వేడుకలో వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె సిటీ: ఎస్‌వీ గ్రూప్స్ అధినేత, మైనార్టీ నాయకుడు పి.సిలార్‌ఖాన్ కుమార్తె డాక్టర్ ఆయిషా, డాక్టర్ సల్మాన్ వివాహం మదనపల్లె పట్టణం రామతులసమ్మ కల్యాణమండపంలో సోమవారం ఘనంగా జరిగింది. సాయంత్రం జరిగిన వివాహ రిసెప్షన్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నిస్సార్‌అహ్మద్, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బి.నరేష్‌కుమార్ రెడ్డి, ఏపీఎంఐడీసీ మాజీ చైర్మన్ షమీమ్‌అస్లాం, వెంకటరెడ్డియాదవ్,ఎస్.ఎ.కరీముల్లా పాల్గొన్నారు.



వరుడు డాక్టర్ సల్మాన్‌తో నాయకులు

వేరుశనగ విత్తనకాయలు పంపిణీ



వేరుశనగ విత్తనకాయలు రైతులకు అందజేస్తున్న విశ్వనాథ, లావణ్య

కలకడ : రైతులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను బాలయ్యగారిపల్లెలో సోమవారం పంపిణీ చేశారు. బాలయ్యగారిపల్లె రైతు సేవా కేంద్రంలో బాలయ్యగారిపల్లె సర్పంచ్, కలికిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ విశ్వనాథ, మండల వ్యవసాయశాఖ అధికారిణి లావణ్య వేరుశనగ విత్తన కాయలను రైతులకు అందజేశారు. ప్రభుత్వం 40శాతం రాయితీపై నారాయణి, కే6, టీసీజీఎస్ 1694 రకం విత్తనాల వేరుశనగ కాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. వేరుశనగ పంట సాగుచేసే ఆసక్తి ఉన్న రైతులు ఆధార్‌కార్డు, భూమిపట్టాధార్ పాస్‌బుక్కు, ఫోన్ నంబర్ నమోదు చేసుకుని రసీదు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ అల్లిబాషా, నాయకులు కరీముల్లా, వెంకటరమణ, వ్యవసాయశాఖ అధికారులు శ్రావణ్‌కుమార్, అమృత్‌కుమార్‌రెడ్డి, చందన పాల్గొన్నారు.


నేటి నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ

మదనపల్లె రూరల్ : ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి 40శాతం సబ్సిడీపై నియోజకవర్గంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో మంగళవారం నుంచి వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ శివశంకర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8 గంటలకు నిమ్మనపల్లె మండల కేంద్రం, 10 గంటలకు మదనపల్లె రూరల్ మండలం పెంచుపాడులో 11 గంటలకు రామసముద్రం మండల కేంద్రంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ ప్రారంభిస్తామన్నారు. మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి మదనపల్లె మండలానికి కే-6 రకం కాయలు 1185, నిమ్మనపల్లె మండలానికి కే-6 రకం 305, నారాయణి.800, రామసముద్రం కే-6 రకం 1,060 క్వింటాళ్లు వేరుశెనగ విత్తనకాయలు అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

కలికిరి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు సోమవారం రాయచోటిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా ప్రతిభా అవార్డులు అందుకున్నారు. ఏపీఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల నుంచి లక్ష్మీప్రియ, ఎల్.దివ్య, బి.శిరీషా, బాలికోన్నత పాఠశాల నుంచి జే.సలోని జెన్నిఫర్, అక్షర పాఠశాల నుంచి జీవన్ కుమార్, ఇండియన్ పబ్లిక్ పాఠశాల నుంచి గోవర్ధన్ రెడ్డి అవార్డులు పొందిన విద్యార్థుల్లో ఉన్నారు.

కలకడ : కలకడ కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని అంకిత ప్రతిభా అవార్డు అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటిలో జిల్లా కలెక్టర్ చేతుమీదుగా షైనింగ్‌స్టార్ అవార్డు, రూ.20 వేలు చెక్కున అందజేసినట్లు తెలిపారు.



విద్యార్థులతో జిల్లా కలెక్టర్, ప్రిన్సిపాల్